స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com
PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

2047 లక్ష్యాలకు యువతే చోదకశక్తి
• పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
• మంత్రి జూపల్లి కృష్ణారావు
2

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 80 | శనివారం, 8 ఆగస్టు, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 80 | SATURDAY, AUGUST 8, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |

# 10న వరుణ యాగం

• వర్షాలు సమృద్ధిగా కురిసి.. రైతులు సుభిక్షంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం • పూర్ణాహుతిలో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి • ముహూర్తం ఖరారు చేసిన యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు
• దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు



హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణం వేదికగా ఈ యాగం చేయనున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఖరారు చేసిన ముహూర్తం ప్రకారం యాగ క్రతువులు నిర్వహించనున్నారు. 10న సాయంత్రం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్ మన్నె సత్య నారాయణ రెడ్డి (ఎంఎస్ఎన్ రెడ్డి) తెలిపారు. కృష్ణ, గోదావరి నదులు, రిజర్వాయర్లు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడి పంటలు బాగా పండాలనే సంకల్పంతో సీఎం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆగస్టు 10న సాయంత్రం 3:20 నుంచి 3:24 నిమిషాల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం ఈ యాగంలో పాల్గొంటారని దేవాదాయ శాఖ తెలిపింది. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఎల్ నినో ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.





# బీసీలకు సంరక్షణ చట్టం

• చేనేతలకు మేలు చేసేది.. అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే • మాది బ్రాండ్ ఇమేజ్.. వాళ్లది బ్యాడ్ ఇమేజ్
• జన్‘జీ అభివృద్ధి కోరుకుంటోంది.. జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది
• 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు • చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం
• కుటుంబానికి రూ.25వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు జమ చేసిన సీఎం



చీరాల, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):

బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని.. దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం మిగతా 2లో..

# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

• 22 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు • విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు • రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్
• జెఏడిలో రిపోర్ట్ చేయాలని ఆమ్రపాలికి ఆదేశం

అమరావతి, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):

ఏపీలో పలువురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా మిగతా 2లో..



# త్వరలో డిజిటల్ అసెంబ్లీ

• కౌన్సిల్‌లోనూ పూర్తిస్థాయిలో డిజిటల్ సేవలు • పౌరుల డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ ఆధారిత సర్టిఫికెట్లు • రాష్ట్రంలోని ప్రతి పల్లెకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ • ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 7(వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ, గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి ముంగిటే పౌర సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అదే సమయంలో ప్రపంచ ఆర్థిక అనిశ్చితులను అవకాశాలుగా మలుచుకుంటూ పరిశ్రమలు ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని, తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఏఐ ట్రాన్స్ఫర్మేషన్ కాంక్లేవ్–తెలంగాణ’ను మంత్రి ప్రారంభించి ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాలనలో కృత్రిమ మేధస్సు, బ్లాక్‌చెయిన్, క్లౌడ్ కంప్యూటింగ్, మిగతా 2లో..

# స్కూల్ ఫీజులు ప్రదర్శించాల్సిందే

• స్కూల్ నోటీస్ బోర్డు, వెబ్‌సైట్‌లో ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాలని ఆదేశం
• అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్లకు విద్యాశాఖ కీలక ఉత్తర్వులు
• నిబంధనలు పాటించని స్కూళ్లకు షోకాజ్ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వ్యవహారంలో పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతి వారీ ఫీజుల వివరాలను ప్రతి ప్రైవేట్ పాఠశాల నోటీసు బోర్డు, పాఠశాల వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పోర్టల్లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫీజులను ఎలా నిర్ణయించారు అనే అంశాలకు సంబంధించి పాఠశాల గవర్నింగ్‌బాడీ సభ్యుల సంతకాలతో కూడిన డాక్యుమెంట్లను కూడా పోర్టల్‌లో పొందుపరచాలని స్పష్టం చేసింది. ఫీజు వివరాలను డిస్‌ప్లే చేయని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ మిగతా 2లో..






# చేనేత సంక్షేమానికి పెద్దపీట
2లో..

• రైతు–నేతన్నల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం • మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి సీతక్క

# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్

• గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
• ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
• లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, ఆగస్టు 7: హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస ఆర్టీసీ గతంలో మిగతా 2లో..

# చిన్న కాంట్రాక్టర్లను వేధించొద్దు

• హ్యామ్ రోడ్ల పనులకు మైనింగ్ సమస్యలు లేకుండా చూడాలి
• మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రహదారుల నిర్మాణ పనులకు మైనింగ్ సంబంధిత ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. చిన్న కాంట్రాక్టర్లపై భారీ పెనాల్టీలు విధించడం సరికాదని, అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను వేధించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. సచివాలయంలో శుక్రవారం మైనింగ్ సమస్యలు, హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఇరువురు మంత్రులు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, టీజీఎండీసీ ఎండీ అనుదీప్ దురిశెట్టి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ బి.వి.రావు, మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ నిబంధనల పేరుతో భారీ పెనాల్టీలు విధించడం, మెటల్ అనుమతుల జాప్యం, నిర్మాణ సామగ్రి కొరత వంటి అంశాలపై చర్చ జరిగింది. రూ.5 కోట్ల విలువైన పనికి రూ.54కోట్ల పెనాల్టీ విధించడం దుర్మార్గమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చిన్న కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మైనింగ్ అధికారుల వేధింపుల నేపథ్యంలో కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు.

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులు 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కోమటిరెడ్డి తెలిపారు. ఈ పనులకు అవసరమైన మెటల్, ఇసుక, మట్టి వంటి నిర్మాణ సామగ్రి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 34 ప్యాకేజీలుగా చేపడుతున్న హ్యామ్ రోడ్ల నిర్మాణానికి భారీ మొత్తంలో కంకర, మట్టి, ఇసుక అవసరమవుతుందని పేర్కొంటూ, మెటల్ అనుమతుల విషయంలో కాంట్రాక్టర్లకు ఇబ్బందులు కలగకుండా గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి మిగతా 2లో..

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 80
శనివారం
8 ఆగస్టు, 2026

## ఫీజులు ప్రదర్శించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు సూచించింది. దీంతో ప్రైవే ట్ పాఠశాలల ఫీజుల విషయంలో తల్లిదండ్రు లకు స్పష్టత, పారదర్శకత పెర గుతుందని అభిప్రాయపడింది. ఈ ఫీజులను నియంత్రిం చేందుకు ఓ చట్టం తీసుకురావాల్సిన అవస రం ఉందని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిర్ణ యించింది. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపును ప్రతిపాదిస్తూ ఏడాదిన్నర క్రితమే డ్రాఫ్ట్ బిల్లును సిద్ధం చేశారు. ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీ కరించేందు కు ఈ ముసాయిదాను ఆన్‌లైన్‌లో అందుబా టులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరిలో ఆదేశించారు. కానీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు.

### 2027-28 నాటికి ఫీజు నియంత్రణ చట్టం

సీఎం ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ అధికారులతో ఇటీవ ల ఫీజు నియంత్రణపై చర్చించి ప్రస్తుత ఫీజు వివరాలతో పా టు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించాల ని ఆదేశించి నట్లు సమాచారం. అదేవిధంగా తరగతుల వారీగా ఫీజు వివ రాలను కూడా ప్రదర్శించాలని ఆడిట్ నివేదికలను సమర్పిం చాలని పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసిన విష యం తెలిసిందే. మరోవైపు ముసాయిదా బిల్లుపై ప్రజల అభిప్రాయాల ను సేకరించి మంత్రివర్గంలో చర్చించిన తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టాలని తెలం గాణ ప్రభుత్వం యోచి స్తోంది. మొత్తంమీద 2027-28 అకాడమిక్ ఇయర్ నాటికి ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## చేనేతకు మరింత భరోసా

### నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):

చేనేత రంగానికి మరింత గౌరవం, నేత న్నలకు నిరంతర ఉపాధి, చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. వ్యవ సాయం, చేనేత రంగాలు ప్రభుత్వానికి రెండు కళ్లవంటివని పేర్కొంటూ, చేనేతను ఆదరిస్తే నేతన్న కుటుంబాలకు అండగా నిలిచినట్లేనని చెప్పారు. అదే సమయంలో ములుగు జిల్లా లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చే సేందుకు జిల్లా కాంగ్రెస్ నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించి న వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొని చేనేత ప్రదర్శనను ప్రారంభించారు. వివిధ ప్రాంతా లకు చెందిన నేతన్నలు తయారు చేసిన చీర లు, వస్త్రాలను పరిశీలించి, స్వయంగా మగ్గం నేసి వారి నైపుణ్యాన్ని అభినందించారు. చేనే త వస్త్రాలను కొనుగోలు చేసిన మంత్రి, ప్రజ లు కూడా చేనేత ఉత్పత్తులను ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే అని పేర్కొన్న మంత్రి, వస్త్రాన్ని నేయడం, ధరించ డం ప్రారంభించినప్పుడే నాగరిక సమాజానికి నాంది పడిందన్నారు. చేనేత కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని చెప్పారు. ఒక చీర వెనుక కేవలం నూలుపోగులు మాత్రమే కాకుండా ఒక కుటుంబం ఆశలు, నేతన్న కష్టం, తరతరాల సంప్రదాయం దాగి ఉంటాయని వివరించారు. ప్రతి ఏడాది కోట్ల రూపాయల విలువైన ఇందిరమ్మ చీరల ఆర్డర్లను చేనేత కార్మికులకు అందిస్తున్నామ ని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూని ఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని కూడా చేనేత రంగం నుంచే కొనుగోలు చేస్తున్నామని తెలి పారు. గత ప్రభుత్వాల హయాంలో పేరుకు పోయిన నేతన్నల బకాయిలను విడతల వారీ గా చెల్లిస్తున్నామని, చేనేత రంగం అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు రూ.1,300 కో ట్లను వెచ్చించామని చెప్పారు. వారంలో కనీ సం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించా లని, పండుగలు, శుభకార్యాల సందర్భంగా కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బీసీలకు సంరక్షణ చట్టం

(మొదటి పేజీ తరువాయి)

ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్ర వారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భం గా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్త పేటలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొ న్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రం లోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం'అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లా డుతూ..." స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకు నేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరు పుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాల నే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభిం చాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీ య సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాం టి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకట గిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవి స్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యనిట్లు, పవర్‌లూమ్ యనిట్లకు 500 యనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘా లకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10



కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమ రులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుం ది." అని సీఎం చంద్రబాబు అన్నారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలు స్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతో పాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పా టుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ. 2.5 లక్షల చొప్పున యనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడ కుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అంది స్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు. ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అ య్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తు న్నాం... అభివృద్ధి'ఉపాధి కల్పించేలా పారిశ్రామికా భివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయా లు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు. గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెబితే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13 తేదీన రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెబుతున్నారు. మళ్లీ మడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..? కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్ ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను నేరాలు, ఘోరాలు చేసే వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. కుట్రలను ప్రజలు గమనించాలి... కుట్రదారులను దూరం పెట్టాలి. ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలి."అని సీఎం చంద్రబాబు కోరారు.

### మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం

చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

# చేనేత సంక్షేమానికి పెద్దపీట

హైదరాబాద్, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):

రైతన్న, నేతన్నల సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధి, రైతులకు మెరుగైన మార్కెట్ వ్యవస్థ కల్పనకు కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వేడుకల్లో పాల్గొన్న ఆయన, చేనేత రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ చర్యలను వివరించగా, అనంతరం తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల చేనేత కళాకారులు ఏర్పాటు చేసిన 100కు పైగా స్టాల్స్‌తో కూడిన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు. గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట వస్త్రాలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ బెడ్‌షీట్లు వంటి తెలంగాణ చేనేత ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించాయని పేర్కొన్నారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు కొనసాగే ఈ ప్రదర్శనను ప్రజలు సందర్శించి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి



నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. చేనేత కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత కళలకు పునర్వైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమం కోసం నేతన్న పొదుపు, నేతన్నకు భద్రత, నేతన్న భరోసా, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. చేనేత రుణమాఫీ కోసం రూ.49.27 కోట్లు, నేతన్న భరోసా కోసం రూ.15 కోట్లు, నేతన్నకు చేయూత కింద రూ.304 కోట్లు, మరమగ్గ కార్మికుల సంక్షేమానికి రూ.44 కోట్లు, నేతన్న భద్రతకు రూ.20 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా వేల మెట్రిక్ టన్నుల నూలును సహకార సంఘాలకు సరఫరా చేస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలతో కలిపి మొత్తం రూ.980 కోట్లు విడుదల చేసి చేనేత రంగానికి ఆర్థిక ఊతం కల్పించామని వెల్లడించారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పదవీకాలం ముగిసిన వికారాబాద్ జిల్లా తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. మేస్త్రీ శ్రీనివాస్‌ను చైర్మన్‌గా, షేక్ ఖాసీం అలీని వైస్ చైర్మన్‌గా నియమించినట్లు వెల్లడించారు. రైతులకు మార్కెట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, కొనుగోలు, నిల్వ, విక్రయాల్లో పారదర్శకత పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తూకం, నిల్వ, వేలం ప్రక్రియలను మరింత పారదర్శకంగా నిర్వహిస్తుందనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

# 2047 లక్ష్యాలకు యువతే చోదకశక్తి

### పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):

స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన విజ్ఞాన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, పరిశోధన, శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలే ప్రధాన చోదకశక్తులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అదే సమయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. పాలమూరు విశ్వవిద్యాలయం, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కన్హా శాంతివనంలో నిర్వహించిన విజన్ ఇండియా—2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్, ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్ జాతీయ సదస్సులో పాల్గొన్న మంత్రి, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సమతుల్య, సుస్థిర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, స్టార్టప్‌లు భవిష్యత్ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.

ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక మార్పు కూడా అవసరమని, గ్రామీణ భారతం అప్పుల ఊబి నుంచి బయటపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్—2047, రైజింగ్ తెలంగాణ—2047 లక్ష్యాలు సాకారమవుతాయని చెప్పారు. విశ్వవిద్యాలయాలు విద్యాబోధనకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల తయారీకి కేంద్రాలుగా ఎదగాలని సూచించారు.

అనంతరం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే నీటి పంపిణీ కొనసాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి పొందేందుకే ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని విమర్శించారు.

కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు—రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులను కాంగ్రెస్ హయాంలో ప్రారంభించినప్పటికీ, పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ పూర్తి చేయలేదని ఆరోపించారు. పంపులు, మోటార్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల పనులను నిర్లక్ష్యం చేయడంతో పాటు జూరాలకు అవసరమైన రిజర్వాయర్లు, గట్టు, తుమ్మిళ్ల వంటి ప్రాజెక్టులను కూడా విస్మరించిందన్నారు. ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదని వ్యాఖ్యానించారు.

తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధంగా పోరాడుతోందని, కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటాను సాధించి తీరుతామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అధికారులు సూచించే ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలని సూచిస్తూ, పంట కొనుగోలు, బోనస్ అంశాలపై బీఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారం అసత్యమన్నారు. పాలమూరు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వేగంగా పూర్తి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

## భారీగా ఐఎఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం విభాగం కమి షనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమిం చింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలిని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొ త్తం 22 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎంఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటు చేసుకు న్నాయి. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమి తులయ్యారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనే జింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం.. ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచిం చింది. పి.రవి సుభాష్‌కు ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగిం చింది. ఇక.. పురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిషనర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్య తలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియ మితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిష నర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. అదేవిధంగా హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యా ధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. డిజిటల్ క్యాబినెట్, డిజిటల్ ఆఫీస్, వాట్సాప్ ద్వారా పౌర సేవలు, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, 20కి పైగా ప్రభుత్వ శాఖలను అనుసంధానించే రియల్‌టైమ్ గవ ర్నమెంట్ డ్యాష్‌బోర్డు వంటి సంస్కరణలతో తెలంగాణ డిజి టల్ పాలనలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పౌరు ల డేటా భద్రత కోసం త్వరలో బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టి ఫికెట్ల జారీ ప్రారంభిస్తామని, టీ-ఫైబర్ ద్వారా 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ కల్పించడమే లక్ష్యమని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పౌర సేవలను ఇంటి వద్దకే అందించే ఏర్పాట్లు చేస్తున్నామని, డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయి పేపర్‌లెస్ పాలన అమలు చేస్తామని వెల్లడిం చారు. అనంతరం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్లాస్టిక్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిప్లెక్స్—2026 (హైదరాబాద్ ఇంటర్నేషనల్ ప్లాస్టిక్స్ ఎక్స్‌పో)ను ప్రారంభించిన మంత్రి, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. సంక్షోభ సమయంలో ఆవిష్కరణలు, నాణ్యత, సాంకేతికతపై పెట్టుబ డులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్ మార్కెట్‌ను శాసిస్తాయని పే ర్కొన్నారు. ప్లాస్టిక్స్, పాలిమర్ రంగం దేశ తయారీ రంగానికి వెన్నెముకగా నిలుస్తోందని, వ్యవసాయం, వైద్యం, ఫార్మా, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మౌలిక వసతుల రంగాలకు ఈ పరిశ్రమ కీలక మని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ రంగం ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటికి పైగా మందికి పరోక్షంగా ఉపా ధి లభిస్తోందని, తెలంగాణలో సుమారు రెం డు లక్షల మం ది జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉంద న్నారు. పరిశ్ర మల సమస్యలు, విధానపరమైన అంశాలపై సమగ్ర ప్రతిపా దనలు అందిస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అవస రమైన సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

## చిన్న కాంట్రాక్టర్లను వేధించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులను వేగంగా మంజూరు చేయాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి లేవనెత్తిన అంశాలపై గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించారు. మైనింగ్‌కు సంబంధించిన సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తామని, రాష్ట్ర అభివృద్ధి పనులకు గనుల శాఖ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సామగ్రి సకాలంలో అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# రంగారెడ్డి



## డా. చిక్క దేవదాసు ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**సికింద్రాబాద్, ఆగస్టు 07(వార్త వేదిక సూర్య)**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ చేనేత అధ్యక్షులు డా. చిక్క దేవదాసు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత రంగ అభివృద్ధి, చేనేత కళాకారుల సంక్షేమం, సంప్రదాయ నేత వస్త్రాల పరిరక్షణపై ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి పూనం కౌర్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవిలు, ప్రముఖ సామాజికవేత్త మందా జగన్, వై. వెంకన్న తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చేనేత కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంద జగన్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత రంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు చేనేత ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతి.. బోనాల పండుగ..

### ఎల్ ఎన్ ఆర్ పాఠశాల చైర్మన్ డాక్టర్ వి సునీత..

**మొయినాబాద్ ఆగస్టు 07 (వార్తా వేదిక సూర్య)**



తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అందులో భాగంగా ఆషాడ మాసంలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరుపుకోవడం మనందరి అదృష్టమని చిలుకూరు ఎల్ఎన్ఆర్ పాఠశాల చైర్మన్ డాక్టర్ వి సునీత డైరెక్టర్ రాజేంద్రప్రసాదులు పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ సమీపంలో గల ఎల్ ఎన్ ఆర్ పాఠశాలలో బోనాల సంబరాల ఉత్సవాలను చైర్మన్ సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషాలు వేసి బోనాలు ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు ఆటపాటలు చిన్నారుల నృత్యాలు పోతురాజుల నృత్యాలు యాప కొమ్మల ఆటలతో పాఠశాల ఆవరణ బోనాల సంబరాన్ని సంతరించుకుంది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ మాసంలో తెలంగాణ ప్రజలు గ్రామాలలో ఉన్న దేవతలకు నైవేద్యంగా బోనాలు సమర్పించడం ప్రతి సంవత్సరం జరుగుతుందని పేర్కొన్నారు సనాతన ధర్మం ప్రజల్లో కొనసాగినప్పుడే సాంస్కృతి సాంప్రదాయాలు కట్టుబొట్టు పిల్లలకు నేర్పించిన వారవుతామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయం జరిగిన కార్మికులకు అండగా నిలుస్తా

### బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**కూకట్ పల్లి, ఆగస్ట్ 07 (వార్త వేదిక సూర్య):**



కుత్బుల్లాపూర్ లోని జెఆర్ ఇన్ఫ్రా ఆర్ఎంసి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో ఓనర్ జనార్దన్ రావు, దగ్గర గత కొన్ని నెలల నుంచి కార్మికుడు మహేష్ కుమార్ సింగ్ పనిచేసేవారు. కార్మికుడు మహేష్ కుమార్ ఓనర్ జనార్దన్ రావు అక్టోబర్ నెల వేతనం ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో, కార్మికుల హక్కులను కాపాడేందుకు నిరంతర పోరాటం చేపడుతున్నాడని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బి ఆర్ టి యు కార్మిక నాయకుడు రవి కార్యాలయం వద్దకు వెళ్లి మహేష్ కుమార్ సింగ్ కి జరిగిన అన్యాయం వివరించారు. వెంటనే స్పందించిన రవి హుటాహుటిన ఓనర్ జనార్దన్ రావు తో మాట్లాడి మహేష్ కు రావలసిన అక్టోబర్ నెల వేతనం కార్మికుడు మహేష్ కుమార్ కు చెక్ రూపంలో ఆ వేతనం ఇవ్వడం జరిగింది. కార్మికుడు మహేష్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన విద్యార్థిని అదృశ్యం..

### కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**



శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన షైనీ షారోన్ (19), తండ్రి దేవదాస్, అనే విద్యార్థిని అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థిని ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. షైనీ షారోన్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా రాజేంద్రనగర్ పోలీసులను వెంటనే సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## చేనేతను కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత



### పద్మశాలి సంఘం అధ్యక్షులు - మంద జగన్

**సికింద్రాబాద్, ఆగస్టు 07(వార్త వేదిక సూర్య)**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు శ్రీ మంద జగన్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి పద్మశాలి సంఘ పెద్దలు, చేనేత కార్మికులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా చేనేత రంగ అభివృద్ధికి, పద్మశాలి సమాజ అభ్యున్నతికి విశేష కృషి చేసిన డాక్టర్ చిక్కా దేవదాసు గారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక (షీల్డ్) అందజేసి ఘనంగా సన్మానించారు. సభలో పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడుతూ, సమాజానికి అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ రాజ్యాధికార పార్టీ అధినేత శ్రీ దాసు సురేష్ గారు మాట్లాడుతూ, చేనేత భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేనేత వస్త్రాలను ప్రజలు ఎక్కువగా వినియోగించడం ద్వారా చేనేత కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంద జగన్ మాట్లాడుతూ..చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యం దేశ గర్వకారణమని అన్నారు. చేనేత కళను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చేనేత రంగ అభివృద్ధి, పద్మశాలి సమాజ ఐక్యత కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందా వెంకటస్వామి, బొమ్మ నరేందర్, మందా ఈశ్వర్, రాజేశ్వర్, డి. శ్రీకాంత్, చింతకింది మల్లేష్, చింతకింది సాయికిరణ్, అనదాసు కర్ణాకర్, జి. జనార్ధన్, కర్నాటి ఆనంద్, తౌటం సతీష్, గబ్బేట రాజు, పులి శివకుమార్, శ్యామల శివకుమార్ తదితరులున్నారు.

## ఉన్నత విద్యతో బంగారు భవిష్యత్




### జనగాం ఎమ్మెల్యే. వీ జే ఐ టి చైర్మన్ డాక్టర్. పళ్ళ రాజేశ్వర్ రెడ్డి.. ఘనంగా ఓరియంటేషన్ డే..

**మొయినాబాద్ మున్సిపాలిటీ ఆగస్టు 07( వార్తా వేదిక సూర్య)**

ఉన్నత విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని విద్యార్థులు క్రమశిక్షణతో నాలుగు సంవత్సరాలు ఇష్టంతో చదివితే మీ జీవితాలు చక్కబడతాయని జనగాం ఎమ్మెల్యే కళాశాల చైర్మన్ పళ్ళ రాజేశ్వర్ రెడ్డి. టిసిఎస్ ట్రాన్స్ ఫర్మేషన్ కోచ్ లింక్ 6 సిగ్మా కన్సల్టెంట్ డాక్టర్ ప్రసాద్ చిట్టి మల్ల లు అన్నారు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం లోని అజిత్ నగర్ చౌరస్తాలో గల విద్య ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ అంటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పళ్ళ రాజేశ్వర్ రెడ్డి తో పాటు టి సి ఎస్ ట్రాన్స్ పర్మిషన్ కోచ్ డాక్టర్ ప్రసాద్ చీటీమల్ల.. ట్రీ లాజి ఇన్నోవేషన్ సీనియర్ హెచ్ఆర్ స్పెషలిస్ట్ అర్చన గై లు పాల్గొని ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు నాలుగు సంవత్సరాల పాటు ఉన్నత విద్యలో క్రమశిక్షణతో ఏ రోజుకు ఆ రోజు విద్యుత్ తో పాటు ప్రాక్టికల్స్ నిర్వహించినప్పుడే ఉన్నతముగా ఉత్తీర్ణులై వివిధ కంపెనీలలో మంచి ఉద్యోగ అవకాశాలు సంపాదించుకుంటారని తెలిపారు ముఖ్యంగా కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను బోధించడం జరుగుతుందని రాజేశ్వర్ రెడ్డి తెలిపారు విద్యార్థులకు మా వంతు కృషి ఉన్నప్పటికీని తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల్సిన బాధ్యత మీ పైన ఉంటుందని అన్నారు భావిస్తూ వీరి భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు మంచి ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు విద్యార్థులు అటెండెన్స్ విషయంలో తప్పనిసరిగా కళాశాలకు రావాల్సిందేనని పేర్కొన్నారు. దేశంలో పలు మంచి కంపెనీలలో ఉద్యోగాలు సంపాదిస్తున్నారంటే అది మన తెలంగాణ ప్రజలు అని చెప్పుకోవచ్చునని తెలిపారు ఐఐటి ఉత్తర వాటిలో తెలంగాణ విద్యార్థుల ముందున్నారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని తల్లిదండ్రులను గౌరవిస్తూ కళాశాలలో చెప్పిన వాటిని సక్రమంగా నేర్చుకుంటే మీకే మంచి భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ జి శ్రీలత కళాశాలడ్డీ డాక్టర్ ప్లేస్మెంట్ డైరెక్టర్ వెంకట చలం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి శిఖ కౌశల్ సైన్సెస్ విభాగ అధిపతి డాక్టర్ కె లక్ష్మీనారాయణ ప్రసాద్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం




**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూఎస్‌పీసీ (ఉపాధ్యాయ పోరాట కమిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్సీ అమలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు హెల్త్ కార్డులను జారీ చేయాలని, అవి అమల్లోకి వచ్చే వరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ విధానాన్ని కొనసా గించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యా యులకు టెట్‌లో పాస్ మార్కులను తగ్గించాలని, సబ్జెక్టుల వారీగా టెట్ నిర్వహించాలని, ఇన్‌సర్వీస్ టీచర్లకు వెయిటేజ్ మార్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూఎస్ పీసీ చేపట్టిన దశలవారీ పోరాటం ఉపాధ్యాయుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 29న నిర్వహించనున్న "చలో ఇందిరాపార్క్" కార్యక్రమానికి ప్రతి ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులతో కలిసి భారీ సంఖ్యలో హాజరై ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు యాదగిరి, మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు జై శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా బాధ్యుడు సీతయ్య, మండల కార్యదర్శి నందన ఉమామతి శిరీష, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అలాగే రంగారెడ్డి జిల్లాలోని అన్ని పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి: నర్రగిరి

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**

భవన నిర్మాణ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సమర్థ అమలు కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుడు, సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి పిలుపునిచ్చారు. శుక్రవారం

నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం తెలంగాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు..కార్మికుల జీవనోపాధి, భద్రత, సామాజిక రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని నర్రగిరి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘం నాయకులు, ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

## మైలార్దేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**



మైలార్దేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సమీర్ అనే వ్యక్తి కనిపించకుండా పోయినట్లు అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన మైలర్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమీర్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీర్ ఆచూకీ గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా మైలార్దేపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు..ప్రజల సహకారంతో సమీర్‌ను క్షేమంగా గుర్తించే అవకాశం ఉందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## 35 రోజులుగా ఎస్ఐఆర్ సేవలు..

### బీఎల్‌వోలను కలిసిన పసుపుల సందీప్ ముదిరాజ్

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఆగస్టు 10తో చివరి దశకు చేరుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లిలో బీఎల్‌వోలను కలిసి వారి సేవలను అభినందించారు. గత 35 రోజులుగా ఉప్పర్‌పల్లి పీఆర్ ప్యాలెస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయ కేంద్రం ద్వారా ఓటర్లకు విస్తృత సేవలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తు ఫారాలను నింపించడంతో పాటు, ఆహ్వాన పత్రాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, అవసరమైన సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపర్‌వైజర్ యాదయ్య, రవీందర్ రెడ్డి, విజయ్ యాదవ్, షేక్ బాషా, జయప్రకాష్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, బీఎల్‌వోలు అనిల్, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిజెపి నూతన అధ్యక్షుడిగా గిరి వర్ధన్ రెడ్డి నియామకం

### మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్

**కూకట్ పల్లి, ఆగస్ట్ 07 (వార్త వేదిక సూర్య) :**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బీజేపీ నూతన అధ్యక్షులుగా నియమితులైన గిరి వర్ధన్ రెడ్డి ని జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని నర్వ పవన్ కుమార్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి నేతృత్వంలో బిజెపి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ విధానాలను, ప్రజా సమస్యలపై పోరాటాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బిజెపి ఐటీ సెల్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాధవరం కాంతారావు, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ సుబ్బారావు, కూకట్‌పల్లి ఓబీసీ కన్వీనర్ వినోద్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2 సంచిక : 80
శనివారం 08 ఆగష్టు 2026



## గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**
మైలార్దేవపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆరంగర్ నుంచి దుర్గా నగర్ వెళ్లే మార్గంలో సుమారు 60 ఏళ్ల వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స కోసం తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యలోనే ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు సంఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## బోనాల పండుగ కానుకగా నర్కుడ గ్రామానికి బీటీ రహదారి

### గ్రామాభివృద్ధిలో మరో ముందడుగు

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**



బోనాల పండుగ సందర్భంగా నర్కుడ గ్రామ ప్రజలకు మరో అభివృద్ధి కానుక అందింది. గ్రామంలోని గాడు బావి కల్వర్ట్ నుంచి హనుమాన్ ఆలయం వరకు నిర్మించిన ఆర్ అండ్ బి బీటీ రహదారి పనులు పూర్తయ్యాయి. రహదారి అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకుని, గ్రామ ప్రజల సమస్యను స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా కృషి చేసిన గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు, గ్రామ ప్రజల సహకారంతో ఈ బీటీ రహదారి ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి రాజు ముదిరాజ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలియజేశారు.

## బండారు దత్తాత్రేయ నివాసంలో సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మందా జగన్‌కు విశిష్ట సత్కారం

**సికింద్రాబాద్, ఆగస్టు 07 (వార్త వేదిక సూర్య)**



అల్లాయిబలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ నివాసంలో నిర్వహించిన ఆత్మీయ కార్యక్రమంలో సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మందా జగన్ గారిని ఘనంగా సన్మానించారు. సమాజ సేవ, పద్మశాలి సంక్షేమం, యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడంలో మందా జగన్ గారు చేస్తున్న విశేష కృషిని కొనియాడుతూ శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సేవాభావంతో ముందుకు సాగే నాయకులను ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ..తనకు లభించిన ఈ గౌరవాన్ని పద్మశాలి సమాజానికి అంకితం చేస్తున్నానని తెలిపారు. సమాజ అభివృద్ధి, యువత సంక్షేమం, సేవా కార్యక్రమాల నిర్వహణలో మరింత బాధ్యతతో ముందుకు సాగుతానని అన్నారు. ఈ సన్మానం తనకు మరింత సేవ చేయాలనే స్ఫూర్తిని కలిగించిందని పేర్కొన్నారు.

## చేనేత కార్మికునికి సన్మానం

**గట్టుప్పల. ఆగస్టు 7 వార్త వేదిక సూర్య:**
చేనేత దినోత్సవం సందర్భంగా గట్టుపల గ్రామానికి చెందిన కర్నాటి మనోహర్ ని బిఆర్ఎస్ నాయకులు ఇడం కైలాసం సన్మానించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేతల కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను అమలు చేయాలని అదే విధంగా నూతనంగా ఏర్పాటైన పాలకవర్గాలకు నిధులు ఇచ్చి సంఘంలోని కార్మికులకు పని కల్పించే విధంగా ఉండాలని కోరారు దాంతోపాటు ముడి సరుకుని స్లాట్ పద్ధతిలో అందించాలని కోరారు రైతాంగం పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ తయారైన ప్రతి వస్తాను వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మార్కెటింగ్ చేయాలని కోరారు వాటితో పాటు ఎన్నికల హామీలు ఇచ్చిన విధంగా పెన్షన్ ని నాలుగు వేలు అందించాలని కోరారు

## తాగునీటి పైప్‌లైన్ లీకేజీపై అధికారుల నిర్లక్ష్యం





### వెంటనే మరమ్మతులు చేపట్టాలని కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్ డిమాండ్

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**
ప్రజలకు తాగునీరు అందడం లేదు... రోడ్లపై వృథాగా పారిపోవడానికి మాత్రం ఉందా? అంటూ కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కిస్మత్‌పూర్ 122వ డివిజన్ పరిధిలో ఎర్రకుంట తండా పోచమ్మ ఆలయం సమీపంలో తాగునీటి పైప్‌లైన్ లీకై సుమారు ఇరవై రోజులుగా వేలాది లీటర్ల తాగునీరు రోడ్లపై వృథాగా పారిపోతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించిన నీరుడు శేఖర్ ముదిరాజ్, ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా మరోవైపు విలువైన తాగునీరు వృథాగా పారిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత నీటి సరఫరా అధికారులకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ, ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో వేలాది లీటర్ల నీరు రోడ్లపై వృథాగా పారిపోతున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు..ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని శాశ్వతంగా మరమ్మతు చేయడంతో పాటు, ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, భద్రతా అవరోధాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బోనాల పండుగకు ముందే కాటేదాన్ - మైలార్ దేవ్‌పల్లి సమస్యలు పరిష్కరించాలి

### : జోనల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

**రాజేంద్రనగర్, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ) :**
కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు యస్. వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుల బృందం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాటేదాన్, మైలార్ దేవ్‌పల్లి డివిజన్‌ల పరిధిలోని పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే బోనాల పండుగ సందర్భంగా దేవాలయాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, గుంతలతో నీరు నిలిచిపోయిన రహదారులను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. బోనాలు ఎత్తుకుని వెళ్లే మహిళలు, పాదచారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పలు కాలనీల్లో వీధి దీపాలు నెలల తరబడి వెలగడం లేదని, పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని తెలిపారు. వెంటనే వీధి దీపాలను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. అభివృద్ధి పనుల పేరుతో తవ్విన రహదారులు ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా దశాబ్దాల క్రితం తక్కువ జనాభాకు అనుగుణంగా వేసిన మురుగునీటి పైపులు ప్రస్తుతం సరిపోవడం లేదని, జనాభా



పెరగడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వివరించారు. అందువల్ల ముందుగా పెద్ద సామర్థ్యం గల మురుగునీటి పైపులను ఏర్పాటు చేసి, అనంతరం రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖ అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, బంగారయ్య, అశోక్, శశి, వెంకటరమణ, భాస్కర్, సురేష్, మోహన్, సింహాచలం, మహేందర్, నిఖిల్, చింటూ తదితర కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపండి

### "విద్యార్థులని విద్యకు దూరం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి"

### బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్

### రూ. 10,000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయం ముట్టడి

### బీసీ విద్యార్థి సంఘం హెచ్చరిక

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య )**
రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, రాస్తారోకో, కళాశాల బహిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ.. "ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులని విద్యకు దూరం చేస్తున్నారు. పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల చదువులపై దాడి చేస్తున్నారు" అని తీవ్రంగా ధ్వజమెత్తారు. గత 4 నెలలుగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా ప్రభుత్వానికి కనీస చలనం లేదని ఆరోపించారు.

**ప్రభుత్వ వైఫల్యాలు**

1. రూ. 10,000 కోట్లకు పైగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్. దీనితో కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు.

2. ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు ఐ టి ఉద్యోగాలు, విదేశీ చదువులు వచ్చినా సర్టిఫికెట్ లేక రోడ్డున పడుతున్నారు.

3. జి.ఓ నెంబర్. 8,9 తీసుకొచ్చి గందరగోళం సృష్టిస్తున్నారు. ఫీజు విద్యార్థి ఖాతాలో వేస్తామనడం వల్ల కాలేజీలు ముందే ఫీజు కట్టమని ఒత్తిడి చేస్తున్నాయి.

4. ఫీజు కట్టకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అరెస్టు చేస్తామని భయపెడుతున్నారు. దీనితో విద్యార్థుల్లో చదువుపై అనాసక్తి పెరుగుతుంది.

5.ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ పై ప్రభుత్వానికి స్పష్టత లేదు. గత 18 ఏళ్లుగా ఉన్న ఉచిత విద్యా విధానాన్ని కొనసాగించడం



లేదు.

**బీసీ విద్యార్థి సంఘం ప్రధాన డిమాండ్లు**

1. పెండింగ్ రూ.10,000 కోట్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

2. అసెంబ్లీలో ఫీజు రియంబర్స్మెంట్ పై ప్రత్యేక చట్టం చేసి, ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

3. జి.ఓ నెంబర్ 8, 9 లను వెంటనే రద్దు చేయాలి.

4. బి.సి/ఇ.బి.సి/ఎస్.సి/ఎస్.టి/ మైనారిటీ విద్యార్థుల నుండి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌లో ఒక్క రూపాయి ఫీజు వసూలు చేయరాదు.

5. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలి.

6. ఫీజు బకాయిల కారణంగా ఆగిపోయిన సర్టిఫికెట్లను వెంటనే విడుదల చేయించాలి.

**ప్రభుత్వానికి హెచ్చరిక**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 33 నెలలు అయింది. ఇప్పటికే 4 లక్షల కోట్లు అప్పు తెచ్చారు. 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం మరో రూ. 10 వేల కోట్లు అప్పు తెచ్చినా తప్పు లేదు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తాం. 5 లక్షల మంది విద్యార్థులతో హైదరాబాద్ సచివాలయాన్ని నిర్బంధిస్తాం అని హెచ్చరించారు. "ప్రభుత్వం న్యాయమైన ఈ డిమాండ్‌ను విస్మరిస్తే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది" అని జనార్దన్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నబోయిన రాజు యాదవ్, నాయకులు కొంపల్లి రామన్న గౌడ్, పొగాకు రవికుమార్ యాదవ్, మల్లబోయిన తరుణ్ కుమార్, అనంత నాగరాజు గౌడ్, అంబటి శివకుమార్, గడగోజు విజయాచారి తదితరులు పాల్గొన్నారు.






## చింతల్ సంజీవయ్య నగర్‌లో శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 9వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ 07 ఆగస్టు (వార్త వేదిక సూర్య)**
చింతల్‌లోని సంజీవయ్య నగర్‌లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయం 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు, దీవెనలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయ కమిటీ సభ్యుడు విజయ్ గుప్తా , గడ్డం రాజేందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు స్వాతి రాజేందర్ రెడ్డి, యాదగిరి, పెంటయ్య ముదిరాజ్, సూరా రవీందర్ గౌడ్, విజయేందర్ గుప్తా, ఉమామహేశ్వర్, కృష్ణమ నాయుడు, ఉమేష్, జానయ్య కృష్ణ కుమార్, సిహెచ్ శ్రీనివాస్ గుప్త, కిరణ్ యాదవ్, నాంపల్లి విజయ్, రాజు గుప్తా, రాజమౌళి, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారి కోసం రక్తదానం

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య )**



జన్మదినోత్సవ వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ, ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ తొలి డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ తెలిపారు. శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, ఆయా వార్డుల ప్రజలు రక్తదాన శిబిరం వద్దకు చేరుకుని అసఫ్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ మాట్లాడుతూ.. జన్మదినోత్సవం సందర్భంగా చేసే ఆర్భాటాల కంటే ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడేందుకు సహకరించడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, అభిమానులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలి

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య )**



విద్యార్థులకు పెండింగ్లో ఉన్నటువంటి ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కళాశాల విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు నాంపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేశారు. ఈ సందర్భంగా సంగం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు నాలుగు సంవత్సరాల ఫీజులు 11 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, విద్యార్థులకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫీజులు ఇవ్వకుంటే పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులు ఎలా కొనసాగించాలని ప్రశ్నించారు. డిగ్రీలు పూర్తి అయిపోయిన విద్యార్థులకు ఫీజులు ఇవ్వకపోవడం వలన ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ప్రభుత్వ కళాశాల విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారని వాపోయారు. విద్యార్థులకు ఫీజులు ఇవ్వలేని ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఇష్టాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు.విద్యార్థులకు ఫీజులు చెల్లించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అన్నే పాక అనిల్, కాటిక ప్రేమ్ కుమార్, సాయి తేజ, అంతోని రాజ్, రెహమాన్, అనూష్, శ్రీ హర్షిత, మనీషా, ప్రవల్లిక, తదితరులు పాల్గొన్నారు.



# నాగర్‌కర్నూల్



## టూరిజం ఉద్యోగులపై దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఉన్నతాధికారులు

**ఆగస్టు07 వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :**

గురువారం తెల్లవారుజామున సోమశిల క్షేత్రంలో టూరిజం శాఖ ఉద్యోగులపై దాడి జరిగిన సంఘటన స్థలాన్ని తెలంగాణ టూరిజం శాఖ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు టూరిజం కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ రవీందర్ నాయక్ , విజిలేన్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సమ్మయ్య , నాగర్ కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ పరిశీలించారు. రాత్రి వేలలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించే విదంగా బోటింగ్ పాయింట్ దగ్గర సీసీ కెమెరా లు ఏర్పాటు చేస్తామని వారు అన్నారు.

దాడికి గురైన పర్యాటక శాఖ ఉద్యోగులు దేవరాజు, శివ లకు వైద్యం చేయించి పూర్తి ఖర్చులను టూరిజం కార్పొరేషన్ చెల్లిస్తుంది అని వారు భరోసా కల్పించారు.దాడి చేసిన అయిదుగురు వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను వారు కోరారు

ఈ కార్యక్రమంలో టూరిస్ట్ పోలీస్ లు వీ శివ శంకర్ , నా శివ శంకర్ , శివ ప్రసాద్ , బోటింగ్ యూనిట్ ఇంచార్జ్ ప్రేమ్ కుమార్,చిన్న పుట్టపాగ మహేష్ తదితరులు ఉన్నారు.

## చేనేత సంస్థకు నాబార్డ్

**ఆగస్టు07వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :**

అమరచింత సిల్క్ హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీకి నాబార్డ్ సహకారం కొనసాగుతుందని డీడీఎం మనోహర్ రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కంపెనీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తక్కువ కాలంలోనే సంస్థ అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తులోనూ సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఈవో, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## రూ.14 కోట్ల రైస్ మిల్ కుంభకోణం

**ఆగస్టు07వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :**



పెబ్బేరు సాయి గోపాల్ ఇండోటెక్ రైస్ మిల్లులో రూ.14.82 కోట్ల సీఎంఆర్ ధాన్యం బకాయిల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 2022–23 రబీ సీజన్లో 4,806 మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించలేదని అధికారులు గుర్తించారు. సివిల్ సప్లై డీఎం ఆంజనేయులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మిల్లర్లు పరారీలో ఉన్నట్లు సమాచారం.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

**ఆగస్టు07వనపర్తి( వార్తా వేదిక సూర్య ) :**



ఆత్మకూరులో 108 అంబులెన్స్ స్టేట్ ఫ్లీట్ వరప్రసాద్ రాజు 108, 102 అంబులెన్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సుల్లోని వైద్య పరికరాల పనితీరు, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మెరుగ్గా అందించాలని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారి ఆర్యన్‌కు మేయర్ మమత శ్రీనివాస్ ఆశీస్సులు...

### అప్పనపల్లి 3వ డివిజన్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):**




మహబూబ్‌నగర్ నగరంలోని అప్పనపల్లి 3వ డివిజన్‌కు చెందిన నరేష్, మమత దంపతుల కుమారుడు ఆర్యన్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ నగర మేయర్ శ్రీమతి గుమ్మల మమత శ్రీనివాస్ వేడుకలకు హాజరై చిన్నారి ఆర్యన్‌ను నిండు మనసుతో ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. మేయర్ రాకతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులకు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థి మరణానికి విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలి



### ప్రభుత్వ బడుల్లో పేద విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేదా?

### మృతుడి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, అర్హత గల వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి..

### డిఇఓ కు వినతిపత్రం అందజేసిన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్..

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):**

నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి రంజిత్ పాముకాటుకు గురై మృతి చెందిన ఘటనకు విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, బాధిత కుటుంబంలో అర్హత కలిగిన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బొదిగెలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భద్రతపై చూపుతున్న శ్రద్ధను ప్రభుత్వ పాఠశాలలపై కూడా చూపించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత లోపించడం, పాములు, విషపురుగుల సంచారం వంటి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

విద్యార్థి రంజిత్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పేట నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి అశోక్, కోశాధికారి రమేష్, మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు కొక్కు గౌతం, బీఎస్పీ నాయకులు అజయ్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇంట్లో ఆరోగ్యశ్రీ.. మందకృష్ణ మాదిగ పోరాట ఫలితం



### ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం....

### జడ్చర్లలో కేక్ కట్ చేసి సంబరాలు...

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):**

పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు ఉచిత గుండె వైద్యం అందించాలనే లక్ష్యంతో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమ పోరాటం ఫలితంగానే ఆరోగ్యశ్రీ వంటి పథకాలు రూపుదిద్దుకున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బొర్ర బిక్షపతి మాదిగ అన్నారు. శుక్రవారం జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలోని సిగ్నల్ గడ్డ వద్ద ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బొర్ర బిక్షపతి మాదిగ, టైగర్ జంగయ్య మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొర్ర బిక్షపతి మాదిగ మాట్లాడుతూ.. 2004 ఆగస్టు 7, 8 తేదీల్లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమానికి సంబంధించిన అప్పటి పత్రికా కథనాలు, వీడియోలను ప్రజలకు చూపించి, ఆ పోరాట చరిత్రను ప్రతి పేద కుటుంబానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు.

**పేద చిన్నారుల గుండె వైద్యం కోసం చారిత్రాత్మక పోరాటం..**

2004లో పేద కుటుంబాలకు చెందిన చిన్నారులు గుండె జబ్బులతో బాధపడుతున్నప్పటికీ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పరిస్థితులను గుర్తించిన మందకృష్ణ మాదిగ వారి కోసం ఉద్యమం చేపట్టారని తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన నసీమ అనే బాలిక గుండె ఆపరేషన్‌కు భారీగా ఖర్చు అవసరమైన సమయంలో ప్రభుత్వం నుంచి పరిమితమైన ఆర్థిక సహాయం మాత్రమే అందడంతో, మిగిలిన వైద్య ఖర్చుల కోసం మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని ఆశ్రయించారని వివరించారు.

పేద చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం మరింత సహాయం చేయాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ ఉద్యమాన్ని ఉధృతం చేశారని, చిన్నారులు, వారి తల్లిదండ్రులను సమీకరించి హైదరాబాద్‌లో భారీ ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించారని పేర్కొన్నారు. సచివాలయం ముట్టడికి ప్రయత్నించిన సందర్భంలో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసినప్పటికీ, పేద పిల్లలకు ఉచిత గుండె వైద్యం అందే వరకు ఉద్యమాన్ని కొనసాగించారని తెలిపారు.

**ఉచిత గుండె వైద్యానికి నాంది..**

మందకృష్ణ మాదిగ నిరంతర పోరాటం ఫలితంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించి ఉచిత గుండె వైద్య పరీక్షలు, చికిత్సలకు చర్యలు చేపట్టిందని బొర్ర బిక్షపతి మాదిగ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వైద్య శిబిరాల ద్వారా వేలాది మంది చిన్నారులను గుర్తించి, కార్పొరేట్ ఆసుపత్రుల సహకారంతో ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.

పేదలకు ఉచిత వైద్య సేవలను అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి ఈ ఉద్యమం ఒక ముఖ్యమైన నేపథ్యంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం దేశవ్యాప్తంగా పేదలకు ఆరోగ్య సేవలు అందించే పలు పథకాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు.

మందకృష్ణ మాదిగ కేవలం సామాజిక న్యాయం కోసం మాత్రమే కాకుండా వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లు, పేద పిల్లల వైద్య హక్కుల కోసం కూడా నిరంతరం పోరాడారని అన్నారు. ఆయన సామాజిక సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 2025లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టైగర్ జంగయ్య మాదిగ, బచ్చలకూర వినోద్ మాదిగ, కరాటే శీను మాదిగ, లవ్లీ మాదిగ, భీమ్రాజు మాదిగ, దగ్గుల బాలరాజు మాదిగ, బృందం గోపాల్ మాదిగ, యాదయ్య మాదిగ, శ్రీధర్ మాదిగ, రమేష్ మాదిగ, శివ మాదిగ, మల్లికార్జున మాదిగ, రాజు మాదిగ, సత్యం మాదిగ, ఆంజనేయులు మాదిగ, ఆంద్రస్ రమేష్ మాదిగ పాల్గొన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన అభిమన్యురెడ్డి

### మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):**

రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గుడ్ల జంగయ్య (40) ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి జంగయ్య మృతికి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా నిలిచారు.

అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అభిమన్యు యువసేన సభ్యుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని అభిమన్యు రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ మండల అధ్యక్షుడు బంగారి సంతోష వెంకటేష్, వార్డు సభ్యులు గుడ్ల శ్రీశైలం, గుడ్ల పుల్లయ్య, నాయకులు పోలేపల్లి నర్సిములు, ఇదిగోనిపల్లి డిప్యూటీ సర్పంచ్ రామని రాఘవేందర్, మాజీ వార్డు సభ్యుడు గుడ్ల బాలయ్య, గుడ్ల రాజు, గుడ్ల చెన్నయ్య, గుడ్ల రమ్మయ్య, గుడ్ల గోపాల్, గుడ్ల శేఖర్‌తో పాటు గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలి

### డ్రంక్ డ్రైవింగ్, అతివేగం, సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలి..

### ట్రాఫిక్ పోలీసుల అవగాహన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):**






రోడ్డు భద్రత పట్ల ఆర్టీసీ డ్రైవర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ డి.జానకి, ఆదేశాల మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్ డిపోలో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం, అతివేగం వంటి ప్రమాదకర చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వేగాన్ని నియంత్రించుకోవాలని, సెల్‌ఫోన్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, అప్రమత్తంగా మరియు బాధ్యతాయుతంగా వాహనాలను నడపాలని అధికారులు సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అంజిలయ్య, పోలీస్ కానిస్టేబుల్ ఎల్. రమేష్ పాల్గొని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొత్తం 55 మంది ఆర్టీసీ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం.. సురక్షిత ప్రయాణాన్ని కొనసాగిద్దాం" అని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చారు.

# పాలమూరు బిడ్డకు అరుదైన గౌరవం

### 14వ ఆసియా ఉమెన్స్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు కోచ్‌గా విక్రమాదిత్య రెడ్డి..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య):**

పాలమూరు జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు విక్రమాదిత్య రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 15 నుంచి హాంకాంగ్‌లో నిర్వహించనున్న 14వ ఆసియా ఉమెన్స్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల నెట్‌బాల్ జట్టు కోచ్‌గా ఆయన నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పుల్పోనిపల్లి గ్రామానికి చెందిన విక్రమాదిత్య రెడ్డి.. హన్వాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బోడ నరేందర్ కుమారుడు. అంతర్జాతీయ స్థాయిలో




క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన ఆయనకు భారత మహిళల నెట్‌బాల్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల గ్రామస్తులు,




క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. ఆయన సారథ్యంలో భారత మహిళల నెట్‌బాల్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని గ్రామ సర్పంచ్ వల్పులి భాగ్యలక్ష్మి ర్యాకమయ్య ఆకాంక్షించారు. పాలమూరు గడ్డ నుంచి అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత జట్టుకు కోచ్‌గా ప్రాతినిధ్యం వహించే స్థాయికి విక్రమాదిత్య రెడ్డి ఎదగడం జిల్లాకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 80
శనివారం
08 ఆగష్టు 2026



## చేనేతకు చేయూత..
## కార్మికులకు భరోసా!

### చేనేత రంగానికి చేయూతనివ్వాలి!
### కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి..
### జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా నవాబుపేటలో భారీ ర్యాలీ..

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య ): చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం మరింత చేయూతనందించాలని, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కురిహిని శెట్టి సంఘం, పద్మశాలి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నవాబుపేట మండల కేంద్రంలో ఇరు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది.

ఈ సందర్భంగా చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలని, వారి సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత రంగాన్ని కాపాడటంతో పాటు కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నీలకంఠుడు చిన్నయ్య, శివకుమార్, మంత నర్సింలు, శ్రీనివాసులు, పవన్‌కుమార్, పండరినాథ్, కామారం లింగం, రామచంద్రయ్య, నీలకంఠం, రాజు, బాలు, కళమ్మతో పాటు మహిళలు, సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికంగా రూపొందించాలి

### - జనగణన సంచాలకులు భారతి హోళీ కేరి

కొత్తగూడెం, ఆగస్టు 7 - (వార్తా వేదిక సూర్య)

జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, ఖచ్చితత్వంతో రూపొందించాలని జనగణన సంచాలకులు భారతి హోళీ కేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. తెలంగాణలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరచనున్నట్లు చెప్పారు. ఈ హ్యాండ్‌బుక్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలకు ప్రామాణిక ఆధారంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 10 నుంచి 21 వరకు అన్ని శాఖల నుంచి సమాచార సేకరణ, ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు నమోదు, పరిశీలన, సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి సమాచారం అధికారిక రికార్డుల ఆధారంగా, ఖచ్చితత్వం, సంపూర్ణత, ఏకరూపతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు అన్ని శాఖల నుంచి సమాచారాన్ని సేకరించి, పూర్తిస్థాయిలో ధృవీకరించిన అనంతరం నిర్ణీత గడువులో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను రాష్ట్ర జనగణన కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ప్రణాళికాధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 10న సింగరేణిలో ధర్నా...

### - 12వ వేజ్ బోర్డుపై కేంద్రం మొండి వైఖరికి నిరసన..
### - విలేకరుల సమావేశంలో ఐదు జాతీయ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

కొత్తగూడెం, ఆగస్టు 7 - (వార్తా వేదిక సూర్య)

12వ వేజ్ బోర్డు కమిటీని తక్షణమే ఏర్పాటు చేసి వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల ప్రధాన కార్యాలయాల ఎదుట భారీ ధర్నాలు నిర్వహించనున్నట్లు జేబీసీసీఐ ఆధ్వర్యంలోని ఐదు జాతీయ కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. ఇందులో భాగంగా సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ఉదయం 9 గంటలకు కార్మికుల ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు నాయకులు వెల్లడించారు. కొత్తగూడెంలోని ఏఐటీయూసీ కార్యాలయం శేషగిరి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజు, సీఐటీయూ నాయకులు మంద నర్సింహారావు, హెచ్‌ఎంఎస్ నాయకులు కృష్ణప్రసాద్, టీబీజీకేఎస్ నాయకులు తుమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ... బీఎంఎస్ మినహా ఐదు జాతీయ కార్మిక సంఘాలు ఒకే వేదికపై ఐక్యంగా ఈ ఉద్యమాన్ని చేపడుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను సాకుగా చూపుతూ 12వ వేజ్ బోర్డు ఏర్పాటును ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని వారు ఆరోపించారు. అంతేకాకుండా "ఒక సంస్థ -- ఒక యూనియన్" విధానాన్ని అమలు చేసే ప్రయత్నాలు కార్మిక సంఘాల హక్కులను బలహీనపరిచే చర్యగా అభివర్ణించారు. 10వ వేజ్ బోర్డులో 20 శాతం, 11వ వేజ్ బోర్డులో 19 శాతం వేతన పెంపు సాధించామని గుర్తుచేసిన నాయకులు, ఈసారి కనీసం 30 శాతం వేతన పెంపే లక్ష్యంగా అన్ని కార్మిక సంఘాలు సమన్వయంతో పోరాటం చేస్తున్నాయని స్పష్టం చేశారు. 11వ వేజ్ బోర్డు అమలుకు ఆరు నెలల ముందుగానే కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం, జూలై 1 నుంచి అమలులోకి రావాల్సిన 12వ వేజ్ బోర్డుకు ఇప్పటికీ కమిటీని ఏర్పాటు చేయకపోవడం కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

# చేనేతకు చేయూత..
# నేతన్నలకు అండగా నిలుస్తా



### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య): చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, నేత కార్మికులకు అండగా నిలిచేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

చేనేత వస్త్రాలు కేవలం దుస్తులు మాత్రమే కాదని, వాటి వెనుక తరతరాలుగా కొనసాగుతున్న కళ, సంప్రదాయం, నేత కార్మికుల శ్రమ దాగి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. చేతితో నేసే వస్త్రాలకు ఉన్న ప్రత్యేకత, నాణ్యత, కళాత్మకతను ప్రజలు గుర్తించి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు.

**గద్వాల్, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయి గుర్తింపు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గద్వాల్, నారాయణపేట చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా నేత కార్మికులకు మరిన్ని ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు విక్రయాలకు అవసరమైన అవకాశాలను పెంచుతామని వెల్లడించారు.

మహబూబ్‌నగర్ శిల్పారామంలో స్థానిక చేనేత ఉత్పత్తుల విక్రయానికి స్టాళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న నేత కార్మికులు హ్యాండ్లూమ్ శాఖ అధికారులను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాకు వచ్చే ప్రముఖులు, విశిష్ట అతిథులకు అందించే శాలువాలు, బహుమతులను స్థానిక చేనేత కార్మికుల వద్ద నుంచే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**నేతన్నలను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత..**

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని మాట్లాడుతూ చేనేత వస్త్రాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. నేత కార్మికులు ఎన్నో ఇబ్బందులను అధిగమిస్తూ నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తున్నారని, వారి కళను కాపాడుకోవడంతో పాటు వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలో ఎంపికైన ఉత్తమ చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు.

అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను కలెక్టర్ సందర్శించి వస్త్రాలను పరిశీలించారు. కొన్ని చీరలను కొనుగోలు చేసి నేత కార్మికులను ప్రోత్సహించారు. అధికారులు, ఉద్యోగులు కూడా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో డీఆర్ఓ నిర్మల, జిల్లా హ్యాండ్లూమ్ అభివృద్ధి అధికారి రాజేష్, చేనేత సంఘాల ప్రతినిధులు, నేత కార్మికులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ గేట్ నుంచి కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## కొత్త పెన్షన్‌దారుల ఎంపికకు ప్రభుత్వం శ్రీకారం

### అర్హులైన వారికి కొత్తగా ఆసరా పెన్షన్లు మంజూరు చేసేందుకు చర్యలు

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య): తెలంగాణ ప్రభుత్వం కొత్త పెన్షన్‌దారుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనం అందించాలనే లక్ష్యంతో కొత్తగా పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం మార్గదర్శకాలను ప్రకటించింది.

ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్ స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. అనంతరం ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, డీఆర్‌డీవో/డీఆర్‌ఓ, జిల్లా కలెక్టర్ స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి తుది ఆమోదం ఇవ్వనున్నారు.

**దశలవారీగా పెన్షన్ల ఎంపిక..**

ప్రభుత్వం నిర్ణయించిన ప్రాధాన్యత క్రమంలో ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, దివ్యాంగులు తదితర వర్గాలను దశలవారీగా పరిగణనలోకి తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

దరఖాస్తులపై 360 డిగ్రీల పరిశీలన, సంబంధిత అధికారుల ధ్రువీకరణ అనంతరం అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నవారు తమ గ్రామ పంచాయతీ లేదా సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెన్షన్ మంజూరులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



# మహబూబ్‌నగర్



## డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం!

### నవాబుపేటలో 'రుద్రా'తో ముమ్మర తనిఖీలు..
### పాన్‌షాపులు, టీ దుకాణాలు, బెల్ట్‌షాపుల్లో ఆకస్మిక సోదాలు..
### అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక..

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య):



మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు నవాబుపేట పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో స్నిఫర్ డాగ్ 'రుద్రా' సహాయంతో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు.

నవాబుపేటలోని పాన్‌షాపులు, పూల దుకాణాలు, టీ దుకాణాలు, బెల్ట్‌షాపులు తదితర అనుమానాస్పద ప్రాంతాలను డాగ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేసింది. మత్తు పదార్థాల అక్రమ నిల్వ, విక్రయం, వినియోగానికి పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ నరేందర్ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు పోలీసులకు సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఎస్ఐ నరేందర్, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం.. యువత భవిష్యత్తును కాపాడటం మనందరి బాధ్యత అని పోలీసులు పేర్కొన్నారు.

# విజ్ఞానం-యువశక్తితోనే వికసిత భారత్ సాధ్యం





### పాలమూరు వర్సిటీ ఆధ్వర్యంలో 'విజన్ ఇండియా--2047' జాతీయ సదస్సు ప్రారంభం..
### కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమల సమన్వయంతో లక్ష్య సాధన : మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య): విజ్ఞానం, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు, యువశక్తి సమన్వయంతోనే వికసిత భారత్--2047 లక్ష్యాన్ని సాధించవచ్చని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న విజన్ ఇండియా 2047: విజ్ఞానం, ఆవిష్కరణలు మరియు యువశక్తి సాధికారత సమన్వయం ద్విదిన జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, విధాన రూపకర్తలు, యువత సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత, పునరుత్పాదక ఇంధన రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు.

**నూతన విద్యా విధానంతో మార్పులు...**

సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఏబీఆర్ఎస్ఎం అధ్యక్షులు గుంత లక్ష్మణ్‌జీ జాతీయ విద్యా విధానం--2020పై ప్రసంగించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, పరిశోధనా దృక్పథం, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే నూతన విద్యా విధానం లక్ష్యమన్నారు.

విద్యను కేవలం డిగ్రీలకు పరిమితం చేయకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, పరిశోధన, ఆవిష్కరణలు, బహుళశాఖల విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం నూతన విద్యా విధానం ప్రత్యేకత అని తెలిపారు. భారతీయ జ్ఞాన సంపద, విలువలు, సంస్కృతిని ఆధునిక విజ్ఞానంతో అనుసంధానం చేయడం ద్వారా ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థను నిర్మించవచ్చన్నారు.

**పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం..**

సదస్సుకు అధ్యక్షత వహించిన పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం--2020, వికసిత భారత్--2047, తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలకు అనుగుణంగా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ--విద్యా అనుసంధానం, యువత సాధికారతకు కొత్త దిశానిర్దేశం చేయడమే సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు.

2008లో స్థాపితమైన పాలమూరు విశ్వవిద్యాలయం ప్రస్తుతం ఐదు క్యాంపస్ కళాశాలలు, మూడు పీజీ కళాశాలలు, సుమారు 150 అనుబంధ కళాశాలలు, 35 వేల మందికి పైగా విద్యార్థులతో అభివృద్ధి చెందిందన్నారు. తొమ్మిది విభాగాల్లో పీహెచ్‌డీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, రూ.5 కోట్ల విలువైన పరిశోధన ప్రాజెక్టులు పూర్తయ్యాయని, మరో రూ.1.2 కోట్ల ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని వివరించారు.

పీఎం--ఉషా పథకం ద్వారా ఇంజినీరింగ్, లా కళాశాలల భవనాలు, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఫెసిలిటీస్, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయ విస్తరణ, విద్యార్థి వసతి గృహాలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

**దేశవ్యాప్తంగా నిపుణుల హాజరు..**

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రతినిధులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొంటున్నారు. విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమ--విద్యా భాగస్వామ్యం, యువత సాధికారత, స్థిరమైన అభివృద్ధి, భవిష్యత్ నైపుణ్యాలపై సాంకేతిక సమావేశాలు, నిపుణుల చర్చలు, పరిశోధనా పత్రాల సమర్పణలు నిర్వహించనున్నారు.

కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు, సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, డా. కె. ప్రవీణ, కమిటీ చైర్మన్లు ప్రొఫెసర్ నూర్జహాన్, ప్రొఫెసర్ చంద్రకిరణ్, ప్రొఫెసర్ కిషోర్, పీజీ కేంద్రాల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి**



**భువనగిరి టౌన్ ఆగస్టు 7: వార్త వేదిక సూర్య** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీక అని, మానవాళికి వస్త్రాలను అందిస్తూ సమాజానికి విశిష్ట సేవ చేస్తున్న నేతన్నల కృషి చిరస్మరణీయమని అన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు, కళా వైభవానికి గుర్తింపు తీసుకొచ్చిన ప్రతి చేనేత కుటుంబానికి సమాజం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు.చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. వస్త్రాల కొనుగోలు, పంపిణీలో పారదర్శకత పెంచేందుకు క్యూఆర్ (ఝ=) కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీంతో నకిలీ ఉత్పత్తులకు అడ్డుకట్ట పడటంతో పాటు అసలైన చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని వివరించారు.ప్రపంచవ్యాప్తంగా తెలుగు చేనేత కళాకారుల ప్రతిభను చాటిన పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశంను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. చేనేత రంగానికి ఆయన అందించిన సేవలు యువతకు ఆదర్శమని కొనియాడారు.నేతన్నల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలను మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.అనంతరం అర్హులైన చేనేత కార్మికులకు రుణమాఫీ భరోసా చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన నేతన్నలకు అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ...ముందుగా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు శుభాకాంక్షలు తెలియజేశారు.చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, జాతీయ స్థాయిలోనే పోచంపల్లి ఇక్కత్ చీరలకు ఒక బ్రాండ్ ఉందని అన్నారు.నేతన్నల బ్రాండ్ గుర్తు పట్టేందుకు ఒక ఝ= కోడ్ ను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇతర దేశాల్లో డూప్లికేట్ చేనేత ఇక్కత్ చీరలను మార్కెట్ లో అమ్ముత్తున నేపథ్యంలో పోచంపల్లి బ్రాండ్ అని తెలియజేయుటకు ఒక ఝ= కోడ్ ను తీసుకురావడం జరిగిందని ,ఈఝ= కోడ్ ద్వారా నేతన్న ఎన్ని రోజులు చీర తయారు చేశారో, అవి ఏ ధారాలతో తయారు చేశారో, చీర యొక్క ప్రఖ్యాత , మార్కెట్ ధర వివరాలు తదితర అంశాలను ఈ ఝ= కోడ్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎండి అవేస్ ఉల్ రహమాన్.మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి--రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల--వెంకటేశ్వర్లు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, చేనేత ఒ జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీరేఖ--బాబురావు, యునైటెడ్ వే హైదరాబాద్ సీఈఓ రేఖా శ్రీనివాసన్, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు లవకుమార్, భువనగిరి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఏలే సుధాకర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, చేనేత శాఖ అధికారులు, కౌన్సిలర్లు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి భువనగిరి

## కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగత పెరిగింది

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి**



**చౌటుప్పల్ ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య) :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలన విధానాలకు నిరసనగా ఈనెల 6 నుండి 14 వరకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని ఆయన అన్నారు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి అనేక అంశాలపై మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నిన్న ప్రారంభమైన సీపీఐ ప్రచార జాత ఈ నెల 6 నుండి 14 వరకు కొనసాగుతుందనీ అన్నారు. ఈనెల 9వ తేదీన ఆదివారం ప్రచార జాత చౌటుప్పల్ పట్టణానికి వస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, బద్దుల సుధాకర్, బోయిన యాదయ్య, టంగుటూరి రాములు, రోషనగారి అంజయ్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య, నీల బిక్షపతి, పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు

**- పండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**భువనగిరి టౌన్ ఆగస్టు 7, వార్త వేదిక సూర్య :** కుంభం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కుంభం కీర్తి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శుక్రవారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పోత్నాక్ సన్నీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల. బెడ్ పంపిణీ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జన్మదిన కేక్‌ను కట్ చేసి రోగులు, వారి సహాయకులతో కలిసి వేడుకలను జరుపుకున్నారు. రోగులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తమ ఇళ్లకు చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.అనంతరం కుంభం కీర్తి రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, సమాజ సేవలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎండి అవేస్ ఉల్ రహమాన్.మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి--రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజు ల--వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వేములకొండ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**వలిగొండ : ఆగస్టు 7 (వార్తా వేదిక సూర్య )** వలిగొండ మండల పరిధిలోని వేముల కొండ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల దినోత్సవం అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచి ఏర్పుల వెంకటేశం పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అమృతము లాంటివి పుట్టిన మొదటి ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. ఇవి బిడ్డ ఎదుగుదలకు రోగ నిరోధిక శక్తికి చాలా ముఖ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కాడిగళ్ల రామ నర్సయ్య,, ఇంజమూరి శ్రీను , అంగన్వాడి టీచర్ బోద్ర బోయిన శారద, ఆయా నరసమ్మ , తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి స్కూల్లో ఘనంగా బోనాలు



**వలిగొండ: ఆగస్టు 7 ( వార్తావేదిక సూర్య ) :** వలిగొండపట్టణంలోని గాయత్రి హైస్కూల్ నందుబోనాలు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీమతి అనురాధ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుపుకునే చారిత్రక, సాంస్కృతిక జానపద పండుగ. ఇది ప్రధానంగా ఆషాఢ మాసంలో మహాకాళి (పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ మొదలైన గ్రామదేవతలు) అమ్మవార్లకు నిర్వహించే కృతజ్ఞతా పూజ.బోనం అంటే భోజనం అనే సంస్కృత వికృతి రూపమే బోనం.ఇది అమ్మవారికి సమర్పించే నైవేద్యం.కొత్త మట్టి లేదా రాగి కుండలో అన్నం, పాలు, బెల్లం వండుతారు.ఆ కుండను వేప ఆకులు, పసుపు, కుంకుమతో అలంకరిస్తారు అని అన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి మండల కార్యవర్గ సమావేశం



**రామన్నపేట( వార్తా వేదిక సూర్య) ఆగస్టు 7 :** రామన్నపేట బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకరికంటి మొగులయ్య గారు మండల ఇన్చార్జి కొరివి శంకర్ పాల్గొని వీరు ఇరువురు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇస్తున్న నిధుల ద్వారానే గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి అలాగే అభివృద్ధి కార్యక్రమాలలో కేంద్ర ప్రభుత్వం సహకారంతోటే మౌలిక వసతులు అనేది జరుగుతున్నది రాష్ట్ర ప్రభుత్వ నిధులు అనేది గ్రామపంచాయతీలకు ఇప్పటివరకు ఒక రూపాయి కూడా విడుదల చేయకపోవడం సిగ్గుచేటు చర్యగా వర్ణిస్తూ మాట్లాడారు.అనంతరం కార్యవర్గ సమావేశంలో క్రింది తీర్మానాలు ఆమోదించడం జరిగింది . కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య ఏళ్ల సంజీవరెడ్డి సీనియర్ నాయకులు డోగుపర్తి సుభాష్ షానగుండ భిక్షమాచారి జల లక్ష్మీనారాయణ రాపోలు స్వామి మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ బెజ్జంకి శివకుమార్ ఉపసర్పంచ్లు నల్ల మధుసూదన్ రెడ్డి మూడుదొడ్ల అనూష రమేష్ మిర్యాల రాజ్ కుమార్ మండల ఉపాధ్యక్షులు కంభంపాటి శివరంజన్ బట్టే రమేష్ గజ్జల రాము కార్యదర్శులు బాత్క నరేష్ రేపాక లింగస్వామి వివిధ గ్రామాల బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు డ్రైడే, ఫ్రైడే



**రామన్నపేట )వార్తా వేదిక సూర్య) ఆగస్టు 7 :** దుబ్బాక గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో డ్రైడే -- ఫ్రైడే ప్రత్యేక పారిశుధ్య కార్యక్ర మాన్ని చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గట్టు నరసింహ మాట్లాడుతూ, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైన ఆహారమని,ప్రతి తల్లి తన బిడ్డకు మొదటి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలనే అం దించాలని సూచించారు. ఈ సందర్భంగా నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను గుర్తించి,దోమల వ్యాప్తిని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించవచ్చని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గుండాల రమేష్,పంచాయతీ కార్యదర్శి కవిత,ఆరోగ్య సూపర్వైజర్ గోపాల్,అంగన్వాడీ సిబ్బంది గట్టు సరళ,ఏఎన్ఎం గౌఫియా,ఆశా కార్యకర్తలు లక్ష్మి, లత,వినోద, మంగమ్మ, రజిత, గణేష్,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళలు, తల్లులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**మోత్కూరు, ఆగస్టు 07 (వార్త వేదిక సూర్య):** వర్షపు నీరు పాత వస్తువులలో నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య అన్నారు. డ్రై డే ఫ్రైడే పుష్కరించుకొని ఆరో వార్డు పరిధిలోని రాజన్న గూడెంలో ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గోలుకొండ నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రధాన లక్ష్యం

**- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్**

**ఆలేరు /వార్త వేదిక సూర్య :-** గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని బండకొత్తపల్లి గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బండకొత్తపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలను సర్పంచ్ గద్వాల ఉపేందర్ ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న విద్యా విధానం, విద్యార్థుల రోజువారీ హాజరు శాతం, బోధన తీరు, స్టడీ అవర్స్ నిర్వహణ, విద్యార్థుల అభ్యాస పురోగతి తదితర కీలక అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వంటి అన్ని విద్యా సౌకర్యాలను విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాలన్నా రు.



విద్యార్థు లతో కలిసి మధ్యాహ్న భోజనం

అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గోపాలదాస్ రాములు, చీకటి ఉషా--ఉపేందర్, గ్రామీణ బ్యాంకు డైరెక్టర్ సునీల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, గ్రామ ప్రముఖులు యత్రయ్య, శేఖర్ రెడ్డి, సాయి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ 'ప్రజా చైతన్య జీపు యాత్ర'ను విజయవంతం చేయాలి

**- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ**



**మోటకొండూరు, ఆగస్టు 07(వార్త వేధిక సూర్య):-** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో ఆలేరు నియోజకవర్గంలో నిర్వహించనున్న 'సీపీఐ ప్రజా చైతన్య జీపు యాత్ర'ను ప్రజలు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ జాతీయ మండలి పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పాదయాత్రలు, జీపు యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. .ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు ముసుకు పెంటారెడ్డి, ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు బోల శ్రీనివాస్, పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, పశువుల నరసింహ, ఎండీ శంషుద్దీన్, పైల రాంరెడ్డి, రాపాక ఉమ, సుదగాని వెంకన్న, ఎర్రోజి నాగచారి, గువ్వ వెంకన్న, ఏనుగు వెంకట్ రెడ్డి, జీవికలపల్లి పాండు, పల్లె మదర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాలుగురకాల చెత్తబుట్టలవినియోగంపై అవగాహన

**ప్రారంభించిన సర్పంచకూనూరుసాయి కుమార్ గౌడ్**

**రామన్నపేట (వార్త వేదిక సూర్య) ఆగస్టు 7**

రామన్నపేట మండలం బోగారం గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు చెత్తను వేరు చేసి, సరైన చెత్తబుట్టలో వేయడం అలవాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త తదితర వ్యర్థాలను వేరు చేయడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చగా మరియు ఆరోగ్యకరంగా ఉంచుకోవచ్చని వివరించారు..ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డు మెంబర్లు నేరటి మానస సురేష్ యాదవ్, మేడి ఆంజనేయులు, కనుక మల్లేష్, చిరగోని శిల్పా, నవీన్ యాదవ్, వనం అండాలు యాదగిరి గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ. సుధా, సంఘబంధం అధ్యక్షురాలు పబ్బు జ్యోతి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదె హేమలత, వీవోఏ భోగ సంధ్య పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు కూనూరు మహేష్ గౌడ్, బైకాని మహేష్ యాదవ్, మేడి కృష్ణ, మేడి ముఖేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## సైన్స్ కిట్స్ సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

**- పాల్గొన్న డాక్టర్ ఇర్ఫాన్, ఎంఈఓ రఘురామ్ రెడ్డి**



**మూటకొండూరు, ఆగస్టు 07(వార్త వేధిక సూర్య): -**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాలపై పట్టు సాధించి, నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రోగ్రామ్ లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మూటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'స్టెమ్ ల్యాబ్ సైన్స్ కిట్స్' పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.సంస్థ అందించిన సైన్స్ కిట్స్‌లోని సామాగ్రిని ఉపయోగించి పాఠశాల విద్యార్థులు చేసిన వివిధ శాస్త్రీయ ప్రయోగాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ప్రతి విద్యార్థి ఈ కిట్స్ సామాగ్రిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ జిల్లా కో-ఆర్డినేటర్ సురపంగ శివలింగం సమన్వయకర్తగా వ్యవహరించగా, సంస్థ ప్రతినిధి ఫణీంద్ర విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజా గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాగ్యశ్రీ, విశ్వరూపం, రాజశేఖర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## తల్లిపాలు.. అమృతంతో సమానం

**- డి నాగారం అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నపాసన కార్యక్రమాలు - సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**




**చౌటుప్పల్,ఆగస్టు 07(వార్త వేధిక సూర్య):** చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో తల్లిపాలు అమృతంతో సమానమని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో అంగన్వాడి-1, 2 కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నపాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి అన్నారు. చిన్నారి ఎరుగుదలకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సూపర్వైజర్ ఝాన్సీ, ఆరోగ్య సిబ్బంది గోపీనాథ్, అంగన్వాడీలు జంగమ్మ, జ్యోతి, ఆశా వర్కర్లు యశోధ, శోభ పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 80 || శనివారం ఆగస్టు, 8, 2026 ||



# యాదాద్రి భువనగిరి

# మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకున్న విప్ బీర్ల అయిలయ్య

**- యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**



**యాదగిరిగుట్ట ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య)** : యాదగిరిగుట్ట పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వయంగా పర్యటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాతగుట్ట రోడ్డు, బీసీ కాలనీ, నల్లచెరువు, అంగడి బజార్, బాలికల వసతి గృహం, పెద్దమోరి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విస్తృతంగా పర్యటించారు. జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ముందుగా నల్లచెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాతగుట్ట రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద ఉన్న గోడ సమస్య పరిష్కరించి అక్కడ నిర్మించిన సీసీ రోడ్డు పనులను, సమీపంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం పెద్దమోరి ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. పట్టణంలో డ్రైనేజీ, రహదారులు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బీసీ కాలనీలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్కడ విద్యార్థులకు కుర్చీలు, ప్లేట్లు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాదగిరిగుట్ట డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు కుర్చీల కోసం సహకరించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారి చదువు, వసతి, భోజనం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే అల్పాహారం చేశారు. విద్యార్థుల కోసం స్వయంగా వడ్డించడం ద్వారా వారితో ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాతగుట్ట వద్ద ఉన్న కల్లు కాంపౌండ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, గౌడ్ అన్నలతో ఆత్మీయంగా మాట్లాడారు. వారి కోరిక మేరకు కల్లును స్వీకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గౌడ్ వృత్తిదారుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా ఉంటామని తెలిపారు.

ఈ మార్నింగ్ వాక్ ద్వారా యాదగిరిగుట్ట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పర్యటించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆండాళ్ అమ్మ వారికి ఘనంగా ఊంజల్ సేవ



**యాదగిరిగుట్ట ఆగస్టు 7 (వార్త వేదిక సూర్య) :** శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మ వారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అమ్మవారిని ప్రధాన ఆలయం నందు అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై 10న కలెక్టరేట్ ముట్టడి



**మోత్కూరు, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య ):** కార్మికులపై అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరి నిరసిస్తూ ఈనెల 10న కలెక్టరేట్ ముట్టడిస్తున్నట్లు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మెంట ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఉపయోగపడే చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్ ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఈ లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, రైతు కూలీలు,వ్యవసాయ కార్మికులకు పని కల్పించాలని, కోరారు. 10న జరిగే లెక్టరేట్ ముట్టడికి కార్మికులు సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, మున్సిపల్ కార్మికులు దప్పు లింగమ్మ, అండాలు, కె లక్కీ అవినాష్,అరవింద్ కె మల్లమ్మ,, బిక్షం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కోతుల దాడి.. మహిళకు తీవ్ర గాయాలు



**మోత్కూరు, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య);** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని కొండగడపలో శుక్రవారం కోతులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన తాటిపాముల మానస అనే మహిళ ఇంటి నుండి కిరాణం దుకాణానికి వెళ్తుండగా కోతులు దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం రెండు రోజుల క్రితం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులపై కోతులు దాడి చేయడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా సమీపంలోని పంట పొలాలు వెళ్లి పంటలను ధ్వంసం చేస్తూ రైతులను నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. గత కొంతకాలం నుంచి కోతులు సంచారం రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు, చిన్నారులు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయాందోళన గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ప్రజలు, చిన్నారుల భద్రత దృష్ట్యా తక్షణమేచర్యలు తీసుకోవాలని మాజీ ఎంపిటిసి లెంకల వేణు, స్థానికులు అంబటి విజయ్ కుమార్, కస్తూరి వీరస్వామి కోరారు. మున్సిపల్ కమీషనర్ కు వినతి. మున్సిపల్ పరిధిలోని కొండగడపలో కోతుల బెడదను నివారించాలని కోరుతూ ఆ గ్రామస్తులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గోలుకొండ నర్సయ్య కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతుల దాడులతో ప్రజలు,చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేయగా ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లెంకల వేణు,అంబటి విజయ్ కుమార్,లెంకల శ్రీనివాస్, తొంట యాదగిరి,ఎర్రవెల్లి మధు, తొంట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత మహిళ కార్మికులకు సన్మానం



**మోత్కూరు, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య):** చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, స్వదేశీ భావనకు ప్రతీకగా నిలుస్తున్నాయని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షురాలు చాడ మంజులారెడ్డి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి గౌరు శ్రీనివాస్ గుప్తా లు అన్నారు. శుక్రవారం చేనేత కార్మికుల దినోత్సవం అనే పురస్కరించుకొని చేనేత కార్మికులైన కొక్కుల వరలక్ష్మి, బండారి జయమ్మ, దోర్నాల వసంత, మహేశ్వరం సుజాత, పాలపాటి లావణ్య లను బాజపా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత రంగానికి ప్రత్యేక కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ నేతన్నల సంక్షేమం స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, నాయకులు బద్దం మహేందర్ రెడ్డి, అన్నెపు సత్యనారాయణ, బిరుదు శ్రీను, చేనేత సంఘం నాయకులు పసునూరి సురేష్, పెండెం రాజారాం,చించు లక్ష్మయ్య,,వంగూరి బాలరాజు,చిందం చంద్రమౌళి నారాయణ, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పన రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన బాధ్యత

**- కేసీఆర్ హయాంలో తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా మారిందన్న ఏనుగుల రాకేష్ రెడ్డి**



**భువనగిరి టౌన్ ఆగస్టు 7,వార్త వేదిక సూర్య :** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఐటీ రంగం, పెట్టుబడులు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పరిస్థితిపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి శుక్రవారం భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కల్పన ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో పరిమిత ఉద్యోగాలే ఉండటంతో, యువతకు అధిక సంఖ్యలో ఉపాధి కల్పించేది ప్రైవేట్ రంగమేనని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దిందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో గూగుల్, మెటా, క్వాల్కమ్, ఊబర్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయని, 2014లో 2.90 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య 2023 నాటికి 9.46 లక్షలకు చేరిందని తెలిపారు. ఐటీతో పాటు రిటైల్, నిర్మాణ, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్ రంగాల్లో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు. అనంతరం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన రాకేష్ రెడ్డి, రేవంత్ రెడ్డి పాలనలో పెట్టుబడిదారుల్లో అనిశ్చితి నెలకొందని ఆరోపించారు. హైడ్రా చర్యలు, మూసీ ప్రాజెక్టు, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న పరిస్థితులు పెట్టుబడులకు ప్రతికూలంగా మారాయని అన్నారు. టీఎస్-ఐపాస్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ రైతుబంధు అధ్యక్షుడు కొల్పుల అమరేందర్, పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ జెడ్పీటీసీ సందేలా సుధాకర్, మాజీ కౌన్సిలర్ ఇట్టబోయిన గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాశ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అబ్బగాని వెంకట్, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, వలిగొండ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ రైతుబంధు చైర్మన్ మమతారెడ్డి, పట్టణ కౌన్సిలర్లు నాకోటి నాగు, చీమల రాజు, చెన్న మహేష్, నాయకులు గుజ్జ పవన్, పెంట నితీష్, ముల్లె నాగేంద్ర బాబు, కంకల మహేష్, ఇండ్ల శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**మోత్కూరు, ఆగస్టు 07 ( వార్త వేదిక సూర్య):** చేనేత కార్మికుల కోసం నిరంతరం కృషి చేసిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి రాములు , కోశాధికారి పోచం కన్నయ్య లు అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో మోత్కూరులో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు మంచే పద్మ, కార్యదర్శి మహేశ్వరం మధుసూదన్, డైరెక్టర్లు ఏలూరి మత్స్యగిరి, పెండెం రాజారాం, జోగు మచ్చేందర్,జల్ది రవీందర్, ఎలగందుల సుజాత,దోర్న గోపయ్య సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- 12వార్డు కౌన్సిలర్ రమణ**



**మోత్కూరు, ఆగస్టు 07 (వార్త వేదిక సూర్య):** ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 12 వార్డు కౌన్సిలర్ మెంట రమణ నగేష్ కోరారు. మోత్కూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం 12వ వార్డు గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా రమణ నగేష్ పాల్గొని మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, నీటి పాత్రలు తదితర వాటిని ప్రతి శుక్రవారం తప్పనిసరిగా శుభ్రం చేయాలని ప్రజలకు సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి కుటుంబం డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి కిరణ్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ షాకిరుద్దీన్, మేడి నవీన్, మున్సిపల్ సిబ్బంది మెంట నర్సింహ్మ,రాములు, ఆశా కార్యకర్తలు,పారిశుద్ధ్య సిబ్బంది,వార్డుమహిళలు లావణ్య,రాములమ్మ,, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కవాటి రాములు కుటుంబానికి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పరామర్శ



**ఆత్మకూరు (ఎం), ఆగస్టు 07 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ 4వ వార్డు మెంబర్ కవాటి మల్లయ్య తండ్రి కవాటి రాములు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కవాటి రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చి, వారికి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. రాములు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డితో పాటు స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల పై సమీక్ష సమావేశం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి టౌన్ ఆగస్టు 7,వార్త వేదిక సూర్య :** భువనగిరి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణ పనుల పురోగతిపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.485 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న భూనాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భూనాదిగాని కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా ఇంజనీర్లు ప్రత్యేక చొరవ తీసుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగించే సాగునీటి ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) రవీందర్, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఎస్‌డీసీ జగన్నాథరావు, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి–రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శైలేందర్, ఖుర్షీద్, బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, వలిగొండ పీఏసీఎస్ చైర్మన్ గరిసె రవి, చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ సతీష్ పవన్, డీఈలు సంబంధిత శాఖల అధికారులు తదితరు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**